క్లుప్తంగా

పరామర్శ



లక్ష్మునాయుడు కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ఎమ్మెల్సీ పెనుమత్స సూర్యనారాయణరాజు

నెల్లిమర్ల రూరల్: మండలంలోని జగ్గరాజుపేట గ్రామానికి చెందిన విశ్రాంత ఉపాధ్యాయుడు, ఎంపీటీసీ మాజీ సభ్యుడు కల్యాణం లక్ష్మునాయుడు కుటుంబ సభ్యులను ఎమ్మెల్సీ డాక్టర్ పీవీవీ సూర్యనారాయణరాజు ఆదివారం పరామర్శించారు. లక్ష్మునాయుడు కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ, ఇటీవల కన్నుమూశారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్సీ గ్రామానికి చేరుకుని లక్ష్మునాయుడు కుటుంబ సభ్యులను పరామర్శించి, ఓదార్చారు. కార్యక్రమంలో సర్పంచ్ రాంబార్కి రామారావు, రామతీర్థం ట్రస్ట్‌బోర్డు సభ్యుడు బూర్లె సత్యం, వైఎస్సార్‌సీపీ నాయకులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

కాలిన గాయాలను నీటితో శుభ్రం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ సుష్మ

విజయనగరం ఫోర్ట్: కాలిన గాయాలను చల్లని నీటితో శుభ్రం చేయాలని ప్లాస్టిక్ సర్జన్ మాటూరి సుష్మ అన్నారు. ఆదివారం స్థానిక పూల్‌బాగ్‌లోని ఓ ఫంక్షన్ హాల్‌లో ఉత్తరాంధ్ర సామాజిక గ్రామీణ వైద్యులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, శరీరంలో ఏదైనా కణజాలం తెగినప్పుడు లేదా కాలినప్పుడు తిరిగి యథావిధిగా పనిచేసేలా శస్త్రచికిత్స ద్వారా సరి చేయడమే ప్లాస్టిక్ సర్జరీ విధానమన్నారు. కాలిన గాయాలకు డ్రెస్సింగ్ చాలా అవసరమని తెలిపారు. కార్యక్రమంలో మాటూరి దినేష్ కుమార్, గ్రామీణ వైద్యుల సంఘ ప్రతినిధులు గద్దె చిరంజీవి, ఎం. తిరుపతి, వెంకటరమణ, తదితరులు పాల్గొన్నారు.

నిందితులను కఠినంగా శిక్షించాలి

తెర్లాం: బొండపల్లి తహసీల్దార్ రమణయ్య హత్య కేసు నిందితులను కఠినంగా శిక్షించాలని వీఆర్‌వోల సంఘం నాయకుడు సువ్వాడ నరసింహనాయుడు డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని విలేకరులతో ఆదివారం మాట్లాడిన ఆయన భూ వివాదాల కారణంగా తహసీల్దార్‌ను దుండగులు హత్య చేయడం దారుణమన్నారు. ఈ దుర్ఘటనను వీఆర్‌వోల సంఘం తరఫున తీవ్రంగా ఖండిస్తున్నామని, బాధిత కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతి తెలుపుతున్నామన్నారు. నిందితులను త్వరగా పట్టుకుని, అరెస్ట్ చేయాలన్నారు. తహసీల్దార్లకు ప్రభుత్వం మరింత రక్షణ కల్పిస్తూ భరోసానివ్వాలన్నారు. మళ్లీ ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని కోరారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన

రేగిడి: మండలంలోని సోమరాజుపేట, అంబఖండి గ్రామాల్లో ప్రకృతి వ్యవసాయంపై ఆదివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ప్రకృతి వ్యవసాయం యూనిట్ ఇన్‌చార్జ్ నాగరాజు ప్రకృతి వ్యవసాయం ఆవశ్యకత, ప్రయోజనాలను రైతులకు వివరించారు. ప్రకృతి వ్యవసాయం ద్వారా ఆరోగ్యవంతమైన పంట చేతికి వస్తుందని, వాటిని తినడం ద్వారా ఆరోగ్యకర సమాజం ఏర్పడుతుందన్నారు. ప్రకృతి వ్యవసాయంలో భాగంగా తయారయ్యే జిల్లేడు కషాయంతో పంటకు పట్టే చీడపీడలు నివారించవచ్చని, పత్రద్రావణం, తూటాకు కషాయంతో వరి పంటలో దోమపోటును నివారించవచ్చన్నారు. కార్యక్రమంలో ఐసీఆర్‌పీలు లక్ష్మణనాయుడు, వరలక్ష్మి, రవి, తదితరులు పాల్గొన్నారు.

పూరిల్లు దగ్ధం



మంటల్లో కాలిపోతున్న ఇల్లు

మెంటాడ: స్థానిక ఎస్సీ కాలనీలో ఆదివారం సాయంత్రం జరిగిన అగ్నిప్రమాదంలో దేశాబత్తుల చిరంజీవి పూరిల్లు పూర్తిగా దగ్ధమైంది. అదృష్టవశాత్తు ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఈ దుర్ఘటన జరగడంతో ప్రాణాపాయం తప్పింది. గర్భిణి అయిన తన భార్యను వైద్య తనిఖీల కోసం దగ్గరలోని ఆస్పత్రికి చిరంజీవి తీసుకువెళ్లి, వచ్చేసరికి ఈ ఘటన జరిగి, ఇంట్లో ఉన్న సామగ్రి అంతా కాలిపోయింది. ఈ సమాచారం అందుకున్న గజపతినగరం అగ్నిమాపక సిబ్బంది హుటాహుటిన ఘటన స్థలానికి చేరుకుని, మంటలను ఆర్పివేశారు. మండలంలోని పిట్టాడలో ఓ ప్రైవేటు కార్యక్రమానికి హాజరైన డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర అక్కడి నుంచి సంఘటన స్థలానికి చేరుకుని, ప్రమాదంపై ఆరాతీశారు. అనంతరం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి, రూ.5 వేల ఆర్థికసాయం చేశారు. తహసీల్దార్‌తో మాట్లాడి, బాధితులకు తక్షణ సాయం అందేలా చూడాలని ఆదేశించారు. కార్యక్రమంలో సర్పంచ్ ఆర్.రాంబాబు, వైఎస్సార్ సీపీ నేత ఎస్.నారాయణరావు తదితరులు పాల్గొన్నారు

అడ్డంకులు అధిగమించి..

రోడ్డు విస్తరణకు శ్రీకారం

- నగరంలోని అంబటి సత్రం – కొత్తపేట రోడ్డు విస్తరణ
- రూ.4.58 కోట్ల ఆర్‌అండ్‌బీ, కార్పొరేషన్ నిధులతో పనులు ప్రారంభం
- ప్రధాన రహదారుల అభివృద్ధికి పెద్ద పీట: డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి



అంబటి సత్రం జంక్షన్ నుంచి కొత్తపేట నీళ్ల ట్యాంక్ రహదారి విస్తరణ పనుల శిలాఫలకం ప్రారంభిస్తున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి



అభివృద్ధి చెందనున్న రోడ్డు ఇదే

విజయనగరం: గత ప్రభుత్వ హయాంలో ప్రారంభించి చేయలేక చేతులెత్తేసిన అభివృద్ధి పనులు పూర్తిచేసే దిశగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. ప్రజా సమస్యల పరిష్కారంతో పాటు నగర అభివృద్ధే ధ్యేయంగా విజయనగరం కార్పొరేషన్ పరిధిలోని ప్రధాన రోడ్ల విస్తరణపై ప్రత్యేక దృష్టి సారించింది. ఇప్పటికే నగరంలోని వివిధ మార్గాల్లో రోడ్ల విస్తరణ పనులు పూర్తి చేసి ప్రగతి బాటలు వేస్తోంది. నిత్యం ప్రయాణికులతో రద్దీగా ఉండే బాలాజీ జంక్షన్ నుంచి మయూరి జంక్షన్ రోడ్డును (1.2 కిలోమీటర్లు) వంద నుంచి 120 అడుగుల వెడల్పుతో ఆరు లేన్లుగా విస్తరించి వినియోగంలోకి తీసుకువచ్చిన విషయం విదితమే. తాజాగా నగరం నడిబొడ్డులో గల అంబటిసత్రం జంక్షన్ నుంచి కొత్తపేట నీళ్ల ట్యాంక్‌కు వెళ్లే ప్రధాన రహదారి (విజయనగరం – పాలకొండ రహదారి) విస్తరణ పనులకు డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి, నగర మేయర్ వెంపడాపు విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ ముచ్చు లయాయాదవ్, కార్పొరేషన్ ఫ్లోర్‌లీడర్ ఎస్‌వీవీ రాజేష్ స్థానిక కార్పొరేటర్లతో కలిసి ఆదివారం శ్రీకారం చుట్టారు. పండుగ వాతావరణంలో శంకుస్థాపన కార్యక్రమాన్ని నిర్వహించారు. అంబటి సత్రం జంక్షన్ నుంచి మేళతాళాలు, డప్పు వాయిద్యాలతో నీళ్లట్యాంక్ జంక్షన్ వరకు ర్యాలీగా వెళ్లి అక్కడ శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. శిలాఫలకం ఆవిష్కరించిన అనంతరం కొబ్బరికాయలు కొట్టి విస్తరణ పనులు ప్రారంభించారు.

60 అడుగుల వెడల్పుతో..

అంబటిసత్రం జంక్షన్ నుంచి కొత్తపేట నీళ్లట్యాంక్ వరకు (విజయనగరం – పాలకొండ రహదారి) 60 అడుగుల వెడల్పుతో 930 మీటర్ల పొడవున రూ.4.58 కోట్లతో విస్తరణ పనులు చేపట్టనున్నారు. ఇందులో భాగంగా ఆర్‌అండ్‌బీ పరిధిలో 600 మీటర్ల పొడవుల గల రహదారి విస్తరణకు రూ. 3.15 కోట్లు కేటాయించగా... కార్పొరేషన్ పరిధిలో గల మరో 330 మీటర్ల పొడవు గల రోడ్డు విస్తరణకు రూ. 93.50 లక్షల నిధులు మంజూరు చేశారు. కేటాయించిన నిధులతో రోడ్డుకు ఇరువైపులా కాలువల నిర్మాణం చేపట్టడంతో పాటు సెంట్రల్ డివైడర్‌ను ఏర్పాటు చేయనున్నారు. అదేవిధంగా కార్పొరేషన్ ఆధ్వర్యంలో సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేయనున్నారు. ఇప్పటికే ఆ మార్గంలో నష్టపోయిన భవన యజమానులకు నష్టపరిహారం చెల్లింపు ప్రక్రియ పూర్తికావడంతో పనులు ప్రారంభించడమే తరువాయిగా మిగిలింది. పనులు ప్రారంభించి పూర్తి చేస్తే విజయనగరం నుంచి పాలకొండ వెళ్లే ఈ మార్గంలో ప్రయాణం మరింత సులువవుతుంది.

ప్రధాన రహదారులన్నీ పూర్తి..

ఈ సందర్భంగా డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి మాట్లాడుతూ.. అస్తవ్యస్తంగా ఉన్న అంబటి సత్రం నీళ్ల ట్యాంక్ జంక్షన్ రహదారి పూర్తయితే నగరంలోని అన్న ప్రధాన రహదారుల విస్తరణ పూర్తయినట్లేనని చెప్పారు. అన్ని రంగాల్లో నగరాన్ని అభివృద్ధి చేయగలిగామన్నారు. శాసనసభ్యుడిగా ఎన్నికైన తర్వాత నగరంలోని సమస్యలను గుర్తించి ఒక్కొక్కటిగా పరిష్కరించామన్నారు. గతంలో తాగునీటికి అనేక అవస్థలు ఎదుర్కొనే వారని, ప్రణాళికాబద్ధంగా ఆలోచన చేసి ప్రస్తుతం రోజు విడిచి రోజు మంచి నీటిని అందించగలుగుతున్నామని చెప్పారు. మౌలిక సదుపాయాలు కల్పించడంతో పాటు ప్రధాన జంక్షన్‌లను అభివృద్ధి చేశామని గుర్తు చేశారు. గడిచిన 4 సంవత్సరాల 9 నెలల కాలంలో నగర వ్యాప్తంగా 12 వందల వరకు వీధి దీపాలు ఏర్పాటు చేయించామన్నారు. చెరువులు, పార్కులను సుందరంగా తీర్చిదిద్దామని తెలిపారు. జిల్లా కేంద్రంలో మహిళా పార్కు ఏర్పాటు చేసి రాష్ట్ర స్థాయిలో ఖ్యాతి గడించామన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సంక్షేమ కార్యక్రమాలను అందిస్తుంటే.. తన హయాంలో నగరం అన్నివిధాలా అభివృద్ధి చెందడం ఆనందంగా ఉందని చెప్పారు. రాష్ట్రంలో అవినీతిరహిత పాల సాగుతోందని తెలిపారు. త్వరలోనే వీఎంఆర్‌డీఏ నిధులతో ఆర్‌అండ్‌బీ జంక్షన్ నుంచి అయ్యన్నపేటకు వెళ్లే ప్రధాన రహదారిని ప్రారంభించి, ప్రజలకు అంకితం ఇస్తామని చెప్పారు. సంక్షేమ పాలన కొనసాగడానికి జగనన్నను మరోసారి ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో వివిధ డివిజన్ల కార్పొరేటర్లు అల్లు చాణక్య, గుజ్జల నారాయణరావు, ఇసరపు రేవతీదేవి, బండారు ఆనందరావు, పట్టా ఆదిలక్ష్మి, రేగాన రూపాదేవి, కో ఆప్షన్ సభ్యురాలు ముద్దాడ రమణి, వైఎస్సార్‌సీపీ నాయకులు, స్థానికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

రైల్వే కూలీలకు అండగా...

- కష్టసుఖాలు అడిగి తెలుసుకున్న చిన్న శ్రీను సోల్జర్స్ అధ్యక్షురాలు సిరిసహస్ర



హమాలీలకు చొక్కాలు అందజేస్తున్న చిన్న శ్రీను సోల్జర్స్ అధ్యక్షురాలు సిరి సహస్ర

విజయనగరం టౌన్: విజయనగరం ఈస్ట్‌కోస్ట్ రైల్వే స్టేషన్ ఆవరణలో పనిచేస్తున్న రైల్వే హమాలీల కష్టసుఖాలను చిన్న శ్రీను సోల్జర్స్‌అధ్యక్షురాలు, జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు కుమార్తె సిరిసహస్ర అడిగి తెలుసుకున్నారు. ఆదివారం హమాలీలతో కలిసి ఆమె అల్పాహారం తీసుకుంటూ ఆప్యాయంగా మాట్లాడారు. సమస్యలను జెడ్పీ చైర్మన్ దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. అంతకుముందు వారందరికీ యూనిఫామ్ చొక్కాలు అందజేశారు. కార్యక్రమంలో చిన్న శ్రీను సోల్జర్స్ ఉపాధ్యక్షుడు తోట వాసు, కార్యదర్శి జాకీర్ హుస్సైన్, శ్రీనివాస్, శివ, జగదీష్, అభిరామ్, సాయి, తదితరులు పాల్గొన్నారు.

క్యాన్సర్ వ్యాధిపై అవగాహన అవసరం

- రెడ్‌క్రాస్ సొసైటీ కార్యదర్శి సత్యం



సైకిల్ ర్యాలీ చేస్తున్న రెడ్‌క్రాస్ సొసైటీ సభ్యులు

విజయనగరం ఫోర్ట్: క్యాన్సర్ వ్యాధిపై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని రెడ్‌క్రాస్ సొసైటీ కార్యదర్శి కె.సత్యం అన్నారు. ప్రపంచ క్యాన్సర్ దినం సందర్భంగా రెడ్‌క్రాస్ రూపొందించిన కరపత్రాలను ఆదివారం పంపిణీ చేస్తూ అవగాహన ర్యాలీ నిర్వహించారు. కలెక్టరేట్ కూడలి నుంచి ఎత్తుబ్రిడ్జి మీదుగా ఆర్టీసీ కాంప్లెక్స్, కోట జంక్షన్, మూడు లాంతర్లు, గంటస్తంభం వరకు ర్యాలీ సాగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, క్యాన్సర్ చాలా ప్రమాదకరమైన వ్యాధిన్నారు. అవగాహనతో వ్యాధిని నియంత్రించవచ్చని చెప్పారు. కార్యక్రమంలో బి.రామకృష్ణారావు, డి. గౌరి, రమణ, సురేష్, సత్యారావు, రమేష్, తదితరులు పాల్గొన్నారు.



విజయనగరం: మధుమేహ పరీక్షలు నిర్వహిస్తున్న సిబ్బంది

అవగాహనతో అడ్డుకట్ట..

విజయనగరం: ప్రపంచ క్యాన్సర్ దినం సందర్భంగా శ్రీ సాయికృష్ణా వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో అయ్యన్న పేట జంక్షన్ వద్దనున్న క్లబ్ నడక మైదానంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. క్లబ్ అధ్యక్షుడు తాడ్డి ఆదినారాయణ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో క్యాన్సర్‌పై అవగాహన కల్పించడంతో పాటు వాసవీ డయాగ్నస్టిక్ సెంటర్ వారి సౌజన్యంలో మధుమేహ పరీక్షలు జరిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన క్లబ్ గౌరవ సలహాదారుడు పిన్నింటి సూర్యనారాయణ, క్లబ్ గౌరవాధ్యక్షుడు డాక్టర్ ఏఎస్ ప్రకాశరావు మాట్లాడుతూ.. ప్రతిఒక్కరూ మధుమేహాన్ని అదుపులో ఉంచుకోవడంతో పాటు క్యాన్సర్ వ్యాధిపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. అలాగే క్రమం తప్పకుండా వ్యాయామం చేయడంతో పాటు ఆహార నియమాలు పాటించాలన్నారు. కార్యక్రమంలో క్లబ్ ఉపాధ్యక్షులు వల్లూరి శ్రీనివాసరావు, జనార్దన్ మాస్టారు, క్లబ్ కోశాధికారి ఆర్‌సీహెచ్ అప్పలనాయుడు, కిలారి గోవింద్, పైడియ్య, కోట్ల ఈశ్వరరావు, పి.అప్పలరాజు, తదితరులు పాల్గున్నారు.

దరఖాస్తు చేసుకుంటే కుళాయి కనెక్షన్



దరఖాస్తులను పరిశీలిస్తున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల

- డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి

విజయనగరం:

దరఖాస్తు చేసుకున్న వారందరికీ కుళాయిలు మంజూరు చేయనున్నట్లు డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి అన్నారు. విజయనగరం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో గల కేఎల్ పురం వాటర్‌ట్యాంక్ వద్ద కుళాయి కనెక్షన్ల కోసం కోలగట్ల ఆధ్వర్యంలో ఆదివారం దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా కేఎల్‌పురం రెవెన్యూ కాలనీలకు చెందిన 70 మంది లబ్ధిదారులు దరఖాస్తులు అందజేశారు. అనంతరం కోలగట్ల మాట్లాడుతూ, దరఖాస్తుదారులందరికీ కనెక్షన్లు మంజూరు చేస్తామని చెప్పారు. కేఎల్ పురంలో తాగునీటి సమస్య ఉందని గుర్తించి వాటర్‌ట్యాంక్ నిర్మించినట్లు తెలిపారు. కార్యక్రమంలో కార్పొరేటర్ తాళ్లపైడి సంతోషికుమారి, తాళ్లపూడి రమణ, డీఈఈ ఎస్.అప్పారావు, పార్టీ ప్రతినిధులు, కేఎల్ పురం, కామాక్షి నగర్, రెవెన్యూ కాలనీల ప్రజలు పాల్గొన్నారు.

పామాయిల్ సాగుపై రైతుల ఆసక్తి



ఖండ్యాంలో సాగు చేస్తున్న పామాయిల్ తోట

రేగిడి: మండలంలోని ఖండ్యాం, వెంకటాపురం, కొమెర తదితర గ్రామాల్లోని రైతులు పామాయిల్ పంట సాగుపై ఆసక్తి కనబరుస్తున్నారు. ఆయా గ్రామాల్లోని పామాయిల్ తోటలు ప్రస్తుతం పూత దశకు చేరుకున్నాయి. ప్రభుత్వం ఇస్తున్న రాయితీతో కొత్తగా తోటలు వేస్తున్నారు. మూడేళ్లకే పూత దశకు చేరుకునే ఈ పంట 25 ఏళ్ల పాటు రైతుకు ఫలసాయం అందిస్తుందని వ్యవసాయాధికారి జి.మురళీకృష్ణ తెలిపారు.

ప్రజ్ఞావికాస పరీక్షకు స్పందన



ప్రశ్నపత్రాన్ని విడుదల చేస్తున్న నాయకులు

విజయనగరం పూల్‌బాగ్: భారత విద్యార్థి ఫెడరేషన్ ఎస్ఎఫ్ఐ విజనగరం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక కస్పా హైస్కూల్‌లో పదో తరగతి విద్యార్థులకు ప్రజ్ఞా వికాసం పరీక్ష నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఈశ్వరరావు, ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి సీహెచ్ వెంకటేష్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వీరు మాట్లాడుతూ, భారత విద్యార్థి ఫెడరేషన్ విద్యార్థుల సమస్యలపై నిరంతరం పోరాడుతోందన్నారు. అలాగే పబ్లిక్ పరీక్షలకు ముందు ఇటువంటి పరీక్షలు నిర్వహించి విద్యార్థుల్లో ఉన్న భయాందోళనలు పోగొడుతున్నట్లు చెప్పారు. పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి విద్యార్థులకు నగదు బహుమతులు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు రవికుమార్, సౌమ్య, వెంకటేష్, జిల్లా సహాయ కార్యదర్శులు రమేష్, సమీరా, రాజు, తదితరులు పాల్గొన్నారు.

25 స్థానాలు కేటాయించాలి

- వెలమ సంక్షేమ సంఘ రాష్ట్ర అధ్యక్షుడు గోవిందరావు



సమావేశంలో మాట్లాడుతున్న గోవిందరావు

విజయనగరం ఫోర్ట్: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో అన్ని రాజకీయ పార్టీలు వెలమ సామాజికవర్గానికి 5 ఎంపీ సీట్లు, 25 ఎమ్మెల్యే సీట్లు కేటాయించాలని వెలమ సంక్షేమ సంఘ రాష్ట్ర అధ్యక్షుడు లగుడు గోవిందరావు అన్నారు. ఆదివారం స్థానిక ప్రదీప్‌నగర్‌లో విలేకరులతో మాట్లాడుతూ, ఉత్తరాంధ్రలో అధిక సంఖ్యలో ఉన్న వెలమ సామాజికవర్గానికి అధిక ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. విశాఖపట్నంలో వెలమ సంక్షేమ సంఘ భవనానికి రెండెకరాల స్థలం కేటాయించాలని కోరారు. అలాగే వెలమలను బీసీ డీ నుంచి బీసీ ఏ జాబితాలో చేర్చాలన్నారు. సమావేశంలో సంఘ ప్రతినిధులు పెదిరెడ్ల సత్యం, బర్ల పైడినాయుడు, పెదిరెడ్ల శ్రీనివాస్, లగుడు శ్రీనివాస్, బోదంకి రమణ, తదితరులు పాల్గొన్నారు.

తీరప్రాంతంలో ఉపాధికి ఊతం..

- రాయితీలు ఇచ్చి పరిశ్రమల ఏర్పాటుకు ప్రభుత్వం ప్రోత్సాహం
- వందలాది మందికి దొరుకుతున్న ఉపాధి
- పరిశ్రమలు రాకతో మారిన జీవన విధానం



డానికా ఆక్వా ఎక్స్‌పోర్ట్ పరిశ్రమ



డానికా పరిశ్రమలో విధులు నిర్వహిస్తున్న మహిళా కార్మికులు

పూసపాటిరేగ: జిల్లాలో తీరప్రాంతాలైన పూసపాటిరేగ, భోగాపురం మండలాలకు పారిశ్రామికవేత్తలు క్యూ కడుతున్నారు. చిన్న , మధ్య, భారీ తరహా పరిశ్రముల ఏర్పాటుకు ప్రభుత్వం రాయితీలు ఇచ్చి సహకారం అందిస్తుండడంతో ఎంతోమంది నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు దొరకుతున్నాయి. పూసపాటిరేగ మండలంలో ఐదు భారీ పరిశ్రములు ఏర్పాటయ్యాయి. వాటి ద్వారా సుమారు 15 వేల మంది కార్మికులకు ఉపాధి అవకాశాలు దొరికాయి. మైలాన్, ఎస్ఎంఎస్, విజయనగర్ బయోటెక్, హెచ్‌బీఎల్, సీపీ ఆక్వా పరిశ్రమల ఏర్పాటుతో వేలాది మంది ఉపాధి పొందుతున్నారు. తాజాగా కొప్పెర్లలో డానికా ఆక్వా ఎక్స్‌పోర్ట్స్ లిమిటెడ్ పరిశ్రమను ఏర్పాటు చేయడంతో 300 మందికి ఉపాధి అవకాశం కలిగింది. రొయ్య ప్రాసెసింగ్ యూనిట్ కావడంతో మహిళలకే అధికంగా ఉపాధి అవకాశాలు దొరికాయి. ప్రాసెసింగ్ చేసిన రొయ్యలను విదేశాలకు ఎగుమతి చేస్తున్నారు. కొవ్వాడ రెవెన్యూలో సబూరి ప్లే వుడ్ ఫ్యాక్టరీ నిర్మాణ పనులు శరవేగంగా సాగుతున్నాయి అక్కడ కూడా మరో మూడు వందల మందికి ఉపాధి దొరకనుంది. పూసపాటిరేగ మండల కేంద్రంలో చిన్న తరహా పరిశ్రమ కోవలోకి వచ్చిన ఇండియన్ గ్రాసరీస్ పరిశ్రమను మహిళలే నిర్వహిస్తున్నారు. ఈ పరిశ్రమలో చికెన్‌మసాలా, గరం మసాలా, దోశపిండి, బిర్యానీ రైస్, జీలకర్రపొడి, ఆవాలు, పోపులు, దనియాల పొడితో పాటు పలు రకాలు పౌడర్‌లను మహిళలు తయారు చేస్తున్నారు. పరిశ్రమలో తయారైన ఉత్పత్తులను ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలలో అమ్మకాలు సాగిస్తూ మహిళలు ఉపాధి పొందుతున్నారు.

ఉపాధి దొరికింది



పూసపాటిరేగలో చిన్నతరహా పరిశ్రమ ఏర్పాటు చేయడంతో ఉపాధి దొరికింది. సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పరిశ్రమల ఏర్పాటుకు రాయితీలు ఇచ్చి ప్రోత్సహించడంతో ఎంతోమంది నిరుద్యోగులకు ఉపాధి లభిస్తోంది. ఇంటి వద్ద ఖాళీగా ఉండడంతో దిక్కుతోచని స్థితిలో ఉన్న తమకు గ్రాసరీ పరిశ్రమలో ఉపాధి దొరికింది.

– పొన్నాన దేవి, మహిళా కార్మికురాలు , పిట్టపేట

జీవనం మెరుగుపడింది..



పరిశ్రమలో ఉపాధి అవకాశం కలిగినప్పటి నుంచి జీవన పరిస్థితులు మెరుగుపడ్డాయి. పరిశ్రమల ఏర్పాటుకు ప్రభుత్వం అవకాశం కల్పించడంతో మాలాంటి ఎందరో మహిళా కార్మికులకు ఉపాధి దొరకడంతో ఆర్థికంగా మెరుగుపడ్డాం.

– ఆలేటి శ్రీదేవి, కార్మికురాలు , పూసపాటిరేగ

జూదరుల అరెస్ట్

పూసపాటిరేగ: మండలంలోని వెంపడాం శివారు లేఅవుట్‌లో పేకాటాడుతున్న ఆరుగురు వ్యక్తులను ఆదివారం అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఎ.సన్యాసినాయుడు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నిందితుల నుంచి రూ.55,200 నగదు స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు.